ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు.

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

- రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు.

- విశాఖలోని రుషికొండపై నిర్మించిన పర్యాటక శాఖ భవనాలను మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు పరిశీలించింది.

====================

అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. విజయవాడలోని గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ నిర్మాణ పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విమాన సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలోని చిన్న, మధ్య తరహా విమానాశ్రయాలను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ పథకంతో విమాన సౌకర్యం ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి రానుందని చెప్పారు. దేశంలో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. ప్రజలకు రోడ్డు, రైలు, విమాన, నౌక రవాణా కార్గో సేవలను అందిండంలో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు శ్రీనివాసవర్మ వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

====================

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... బాధితుల సమస్యలను ఓపికగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు మంత్రి సూచించారు.

====================

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ విలేకరులతో మాట్లాడుతూ... మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద 142 కోట్ల రూపాయల వ్యయంతో ఆర్వోబీని నిర్మిస్తున్నామని చెప్పారు. 1,167 కోట్ల రూపాయల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం జరుగుతోందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

====================

విశాఖ నగరంలోని రుషికొండ మీద గత ప్రభుత్వం నిర్మించిన పర్యాటక శాఖ భవనాలను మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు పరిశీలించింది. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి భవనాలను పూర్తి స్థాయిలో పరిశీలించారు. మంత్రుల వెంట పర్యాటక శాఖ, రెవెన్యూ ఉన్నతాధికారులు ఉన్నారు. 452 కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ భవనాలను ఏ విధంగా ఉపయోగించాలనే అంశంపై ఉపసంఘం నిర్ణయం తీసుకోనుంది. ఇదిలా ఉండగా నగరంలోని హరిత యాత్రి నివాస్ లో అధికారులతో సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం రుషికొండ భవనాల వినియోగం మీద సమగ్రంగా చర్చించింది.

విరామం

====================

ప్రతి బిడ్డకూ సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కీలక చర్యలకు శ్రీకారం చుట్టి, జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం చైర్ పర్సన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ లో లైన్ డిపార్ట్ మెంట్ అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలల హక్కుల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. వారి సమగ్ర వికాసానికి కమిషన్ కట్టుబడి ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడానికి క్షేత్ర స్థాయిలో నిఘా పెంచడం జరిగిందని చెప్పారు.

====================

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నీట్ పునః పరీక్ష శ్రీకాకుళం జిల్లాలో అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఈ నెల 21న జరగనున్న నీట్ పరీక్షపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి. మహేశ్వర రెడ్డితో కలిసి ఆయన ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో నీట్ పరీక్షకు 2,103 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, 4 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష జరుగుతుందని వెల్లడించారు.

=====================

యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.ఎం. త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. ఈనెల 21న రాష్ట్రంలో నిర్వహించే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు ధర్మల్ పవర్ స్టేషన్ లో రాష్ట్ర ఎస్పీఎఫ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో “యోగాంధ్ర” కార్యక్రమం ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ... దైనందిన జీవితంలో పోలీసు సిబ్బంది ఎదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిడిల నుండి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఫిట్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు యోగా ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

=====================

లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా భారత్ - అఫ్గానిస్థాన్ జట్ల మధ్య రెండో వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్... అఫ్గానిస్థాన్ కు 403 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన అఫ్గానిస్థాన్ 4 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 154, ఇషాన్ కిషన్ 125 పరుగులతో సెంచరీలు చేసి రాణించారు. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా భారత్ ఇప్పటికే తొలి మ్యాచ్‌లో విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉంది.

=====================

జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో “అతిసారం నిలిపేద్దాం” ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిన్న ప్రారంభించామని, దీనిని జులై 31 వరకూ నిర్వహిస్తామని పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి. గీతాబాయి తెలిపారు. అతిసారం వల్ల సంభవించే చిన్నారుల మరణాలను నివారించడంతో పాటు ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన నీటి వినియోగంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా చెప్పారు.

=====================

తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా రేపు మేఘావృతమైన వాతావరణం ఉంటుందని, పలు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే బాపట్ల, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

=====================
=====================